ఎన్నడూ లేనంతగా నైరుతి రుతుపవనాలు నిరాశపర్చడం, వానకాలం సీజన్ పూర్తికావడం, ఎల్ నినో ప్రభావం కొనసాగుతుండటంతో యాసంగి సాగుపై రైతుల్లో ఆందోళన నెలకొన్నది. వర్షాలు పూర్తిగా కనుమరుగు కావడంతో రానున్న రోజులు ఎలా ఉంటాయని భయాందోళన చెందుతున్నారు. 'ఎల్ నినో' ప్రభావం వచ్చే మార్చి వరకు ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించిన క్రమంలో పంటల దిగుబడిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో వానకాలం ముందు నుంచే ఎల్ నినో ప్రభావం తీవ్రంగా పడింది. గడిచిన నాలుగు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో 12 రోజులపాటు భారీ వర్షాలు కురిసిన పరిస్థితులు లేవు. అకడకడ మోస్తరు వర్షాలే కురిశాయి. పొరుగు రాష్ట్రాల్లో కురిసిన వర్షాల కారణంగా ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్ తదితర జిల్లాలకు వరదనీరు రావటం కొంతమేర ఉపశమనాన్ని కలిగించింది. అయితే ఇప్పుడు వచ్చే యాసంగి సాగుపై రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది.

**సాధారణకంటే 17% లోటు వర్షపాతం**

ఎల్ నినో ప్రభావంతో ఈ వానాకాలం సాధారణ కంటే 17శాతం లోటు వర్షపాతం నమోదైంది. నిర్మల్, యాదాద్రి భువనగిరి, జనగామ, సూర్యాపేట, ఖమ్మం, హైదరాబాద్, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, వరంగల్, మేడ్చల్ మలాజిగిరి, నల్లగొండ, హనుమకొండ, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో ఈసారి తకువ వర్షపాతం నమోదైంది. వీటిలో 8జిల్లాల్లో 30శాతం నుంచి 41శాతం వరకు లోటు వర్షపాతం ఏర్పడింది. జూన్, జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కలిపి 740.6 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా... 615.5 మి.మీ నమోదైంది.

**పడిపోయిన భూగర్భ నీటి మట్టాలు**

ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాల నీటిమట్టాలు వేగంగా పడిపోయి కూరగాయల సాగుకు నీటి ఎద్దడి ఏర్పడింది. పగటి ఉష్ణోగ్రతలు కూడా విపరీతంగా పెరగడం వల్ల సాగు చేసిన పంటల్లో పూత, పిందె రాలిపోతున్నాయి. దీనివల్ల టమాటా, మిరప, బెండ, వంకాయ వంటి నిత్యావసర కూరగాయల దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. ఈనెల మొదటి వారం నుంచే మార్కెట్‌లో టమాటా కొరత ఏర్పడగా, పొరుగు రాష్ట్రాల్లో కూడా అదే పరిస్థితి నెలకొన్నది. దీంతో ఏ కూరగాయల ధరలు చూసిన సగటున కిలో రూ.50 నుంచి రూ.80 మధ్య ధర పలుకుతున్నది. ఉల్లి, ఎల్లిగడ్డ, అల్లం వంటి వాటి ధరలు మరింత పెరిగాయి. మామిడి, బత్తాయి, నిమ్మ, అరటి వంటి బహువార్షిక తోట పంటలకు ఈ కరువు పరిస్థితులు ప్రభావం చూపుతున్నాయి. తగినంత తేమ లేకపోవడంతో కాయ సైజు చిన్నగా మారుతున్నాయి. దీంతో రైతులకు సాగుకు పెట్టిన పెట్టుబడులు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఎల్ నినో ప్రభావంతో తకువ నీటి లభ్యత ఉన్నప్పుడు డ్రిప్ పద్ధతి ద్వారా నేరుగా వేరు వ్యవస్థకు నీరు అందించి 4050% నీటిని ఆదా చేయవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు సూచిస్తున్నారు. నేలపై ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లు పరచడం ద్వారా భూమిలోని తేమ ఆవిరి కాకుండా కాపాడవచ్చని పేర్కొంటున్నారు. ఇది కలుపు మొకలను నివారిస్తుందని చెప్తున్నారు. తీగజాతి కూరగాయలకు పందిరి విధానం శ్రేయసరమని, తీవ్రమైన ఎండల నుంచి రక్షణకు తోటలపై గ్రీన్‌షేడ్ నెట్స్ వాడటంతో ఉష్ణోగ్రతల నుంచి కాపాడవచ్చని సూచిస్తున్నారు. రసాయన ఎరువుల కంటే సేంద్రియ, వర్మీ కంపోస్ట్, జీవామృతం వాడాలని కోరుతున్నారు.

# పుట్టినగడ్డ రుణం తీర్చుకోవడమే నా లక్ష్యం

- హైదరాబాద్ కాలనీలను తలదన్నేలా మున్సిపాలిటీల అభివృద్ధి..
- పేదలు, సెటిలర్స్‌ను ఇబ్బందిపెడితే సహించను : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి





**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం తొర్రూర్ డివిజన్ పరిధిలో రూ.1.38 కోట్లతో పూర్తిచేసిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. శ్రీరంగంపురం కాలనీలో రూ.10 లక్షలు, బాలాజీనగర్‌లో రూ.20 లక్షలు, తిరుమలనగర్ కాలనీలో రూ.10 లక్షలు, యాపిల్ కాలనీలో రూ.35 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే తుర్కయంజాల్‌లో రూ.30 లక్షలతో నిర్మించిన స్మశానవాటిక, రూ.20 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్, యాపిల్ ఎవెన్యూ కాలనీలో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేళ్ల కాలంలో తుర్కయంజాల్, హయత్‌నగర్ ప్రాంతాలను ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. గత 14 ఏళ్లలో ఆయా ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారిపోయాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇస్తున్నారని, హైదరాబాద్ కాలనీలను తలదన్నేలా ఇక్కడి మున్సిపాలిటీలను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆరుట్ల టీపీఎస్, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణాలు ఇందుకు నిదర్శనమన్నారు. తొర్రూర్ సమీపంలో మరో ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ నివాసం ఉంటున్న పేదలు, సెటిలర్స్‌ను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే సహించబోనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. తాను తొర్రూర్‌లోనే అందుబాటులో ఉంటానని, ప్రజలకు ఏ సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చాందీ పెద్దకర్మకు కాంగ్రెస్ నేతల హాజరు

- కుటుంబ సభ్యులను పరామర్శించిన గార్లపాటి వెంకట్ రెడ్డి



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** అనారోగ్యంతో మృతి చెందిన బంగారిగూడెం గ్రామానికి చెందిన చాందీ పెద్దకర్మ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గోపా నాయక్ చిన్నమ్మ చాందీ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, కుటుంబానికి అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. ఆదివారం బంగారిగూడెం గ్రామంలో నిర్వహించిన పెద్దకర్మ కార్యక్రమానికి మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి గార్లపాటి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. తొలుత చాందీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోపా నాయక్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతురాలి కుటుంబానికి ధైర్యం చెప్పి, కష్టకాలంలో అండగా ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ డాక్టర్ సెల్ జనరల్ సెక్రటరీ డాక్టర్ వీరన్న నాయక్, మండల నాయకులు డాక్టర్ కరుణాకర్ జ్యోతి, బంచరాయితండా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్, బంగారిగూడెం గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి, రమేష్, నరేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## శకటంలా గుంత ప్రాణాలు పోయాకే మేల్కొంటారా

- నెలలు గడుస్తున్నా స్పందించని అధికారులు, ప్రజాప్రతినిధులు



**దేవరుప్పుల విశాల భారతి;** దేవరుప్పుల మండల కేంద్రంలోని వాగుపై ఉన్న బారి వంతెన మొదటి భాగంలో ఏర్పడిన భారీ గుంత ప్రమాదకరంగా మారింది. గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగించే ఈ మార్గంలో గుంత కారణంగా ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలు పోతేనే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందిస్తారా? అంటూ ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ఈ గుంత మృత్యు శకటంలా మారిందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా స్పందించి వంతెనపై ఉన్న గుంతను తక్షణమే పూడ్చి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.

## భక్తికి బలం సేవకు చేయూత బబ్బూరి శ్రీకాంత్ గౌడ్

- గణనాధుడికి సేవల్లో ప్రత్యేక ముద్ర శాశ్వత విగ్రహం
- అన్నదానానికి అండగా నిలిచిన దాత



**దేవరుప్పుల విశాల భారతి;** దేవరుప్పుల మండలం పెద్దమదూరు గ్రామానికి చెందిన శ్రీ మల్లికార్జున గజానన మండలి కమిటీ సభ్యులు ఆదివారం హైదరాబాద్‌లో ప్రముఖ పారిశ్రామికవేత్త, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఇటీవల పెద్దమదూరులో వైభవంగా నిర్వహించిన గణపతి నవరాత్రోత్సవాల్లో తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాధుడి పవిత్ర లడ్డూ ప్రసాదాన్ని శ్రీకాంత్ గౌడ్‌కు అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. పెద్దమదూరులో శ్రీ మల్లికార్జున గజానన మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాధుడి శాశ్వత విగ్రహానికి మరియు అన్నదాన దాతగా శ్రీకాంత్ గౌడ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కమిటీ సభ్యులు కొనియాడారు. భక్తి, సేవాభావంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా నిలుస్తున్న ఆయనకు విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రగిరి సంపత్ కుమార్, పెద్దగౌని శ్రీనివాస్, బబ్బూరి శ్రీనివాస్, కారుపోతుల అశోక్, పెద్దగౌని రాజు, బబ్బూరి నాగరాజు, దూడల ఉపేందర్, బబ్బూరి ప్రవీణ్, కారుపోతుల హరీష్, బుషిగంపల శివ, కారుపోతుల నరేష్ తో పాటు శ్రీ మల్లికార్జున గజానన మండలి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాచకొండ దసరా ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

- అక్టోబర్ 11 నుంచి 22 వరకు సాంస్కృతిక వేడుకలు - ఈఎల్వీ భాస్కర్



**చౌటుప్పల్,విశాల భారతి:** రాచకొండ దసరా ఉత్సవాల సమితి, ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించనున్న రాచకొండ దసరా ఉత్సవాల కరపత్రికను ఆదివారం రాచకొండలోని రామాలయం వద్ద ఫౌండేషన్ అధినేత ఇరుగుదిండ్ల భాస్కర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 11వ తేదీ నుండి 17వ తేదీ వరకు మునుగోడు నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సినీ, జానపద కళాకారులచే ఆటపాటలు, బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 22వ తేదీన ఘట్టుప్పల మండలంలో దసరా సంబరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. రాచకొండను పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, హైదరాబాద్ కు సమీపంలో ఉన్న రాచకొండ అభివృద్ధి చెందితే చుట్టుపక్కల గ్రామాలు అభివృద్ధి చెంది స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. రాచకొండలోని ప్రాచీన దేవాలయాల పునర్నిర్మాణానికి తన కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాచప్ప సమితి అధ్యక్షుడు బద్దుల కృష్ణ కుమార్, అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి, వివిధ గ్రామాల ప్రజలు, ఈఎల్వీ భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం తండావాసుల తిప్పలు

- బావి ఉన్నా బుక్కెడు నీళ్లు లేవు!
- జాటోత్ తండాలో తాగునీటి కష్టాలు..
- దాహంతో అల్లాడుతున్న జనం



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** జాటోత్ తండాలో తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారు. తండాలో నీటి బావి అందుబాటులో ఉన్నప్పటికీ దానిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. కనీసం అత్యవసర పరిస్థితుల్లోనైనా నీటి ట్యాంకర్ ద్వారా సరఫరా చేయాల్సి ఉన్నా.. ఆ దిశగా కూడా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై తండావాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నీటి వనరు కళ్లముందే ఉన్నా.. దాహం మాత్రం తీరని దుస్థితి.**

నెలకొన్నదని స్థానికులు వాపోతున్నారు. గత కొద్ది రోజులుగా తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. సమస్యను పలుమార్లు పంచాయతీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పష్టమైన సమాధానం ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడుతున్నారు.

**మాటలు కాదు.. నీళ్లు కావాలి!**

తాగునీటి సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు ప్రజల ఇబ్బందులను పట్టించుకోకపోవడం ఏమిటని తండావాసులు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి విధుల్లో చేరి నెలలు గడుస్తున్నా ప్రజలకు అందుబాటులో ఉండేలా సంప్రదింపు వివరాలు కూడా తెలియజేయలేదని స్థానికుడు గూగుల్ తరుణ్ నాయక్ ఆరోపించారు. బావి ఉన్నప్పుడు దాన్ని ఎందుకు వినియోగంలోకి తీసుకురావడం లేదో.. ట్యాంకర్ ఎందుకు పంపించడం లేదో అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తండాలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించి బావిని వినియోగంలోకి తీసుకురావడంతో పాటు అవసరమైనంతవరకు నీటి ట్యాంకర్లను పంపించాలని కోరారు. ఇకనైనా అధికారులు కళ్లు తెరిచి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని.. లేదంటే తండావాసుల ఆందోళనకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

## భూములు కోల్పోతున్న పేదలకు నష్టపరిహారం చెల్లించాలి

- ములకలపల్లి రాములు డిమాండ్ మునగాల ( ఎస్ ఎన్ పేట )



**విశాల భారతి మునగాల :** మునగాల మండలం ఎస్ఎంపేట రెవెన్యూ లో గల సర్వే నెంబర్లు 95 లో ప్రభుత్వం నిర్మిస్తున్న కేంద్రీకృత వంటశాల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు నిర్మాణానికి స్వాధీనం చేసుకోవడం సరి అయింది కాదని కాదని పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఎస్సీ ఎస్టీ బీసీ లబ్ధిదారులకు నష్టపరిహారం చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మునగాల మాజీ ఎంపీపీ ములకలపల్లి రాములు డిమాండ్ చేశారు ఆయన ఆదివారం ఎస్ఎం పేట రెవెన్యూలో గల సర్వేనెంబర్ 95లో కేంద్రీకృత వంటశాల నిర్మాణం చేస్తున్న భూమిలోకి నిర్వాసితులతో ఆయన సందర్శించి అక్కడే ఉన్న స్థానిక ఆర్డీవో గారితో మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకున్న సేద్యం చేసుకున్న అసైన్మెంట్ చట్టం ప్రకారం అట్టి భూమి పట్టా హక్కులు కల్పించాల్సిన రెవిన్యూ అధికారులే బలవంతంగా భూమిని స్వాధీనం చేసుకోవడం సర్రైన కాదని ఆయన అన్నారు అట్టి భూమిలో ఎస్సీ ఎస్టీ బీసీలు 1998లో ఒక ఎస్టీ రైతు దగ్గర కొనుగోలు చేశారని దానికి సాదా కాగితాలు కూడా ఉన్నాయని అక్కడ 28 కుటుంబాలు ఇండ్లు నిర్మించుకొని మంచినీటి కోసం ఒక బోరు కూడా ప్రభుత్వం చేసిందని ఆయన గుర్తు చేశారు రెవిన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని కమ్యూనిటీ చికెన్ సెంటర్ క నిర్మాణం చేస్తున్న భూమికి ఆ రైతులకు వెంటనే పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు మండలంలో అనేక గ్రామాల్లో వందల ఎకరాల భూములు భూస్వాములు ఆక్రమించుకుని అనుభవిస్తుంటే ఆ భూమి జోలికి పోనీ రెవెన్యూ అధికారులు పేదల భూముల్లోకి వెళ్ళటం సరియైనది కాదని అన్నారు ఎస్ ఎన్ పేట సర్వే నెంబర్ 95 లో ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటున్న భూమికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు గతంలో అట్టి స్థలములో అనేక ప్రభుత్వ ఆఫీసుల నిర్మాణం చేయాలని చూసినప్పటికీ పేదలను దృష్టిలో పెట్టుకొని ఆ భూమిని వదిలేశారని ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే గారు జోక్యం చేసుకొని ఆ పేదలకు న్యాయం చేయాలని రాములు విజ్ఞప్తి చేశారు లేకుంటే ఆ భూముల్లో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు ఈ యొక్క కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమపంగా జానయ్య అరె రామకృష్ణారెడ్డి కిన్నెర వెంకన్న తాడువాయి గ్రామానికి సంబంధించిన ఎస్టీలు ఎస్సీలు తదితరులు పాల్గొన్నారు

## జన్మదిన వేడుకలకు సేవా స్పర్శ

- వృద్ధుల ఆశీస్సులు.. చిన్నారుల మధ్య సంతోషం..
- అన్నదానం, పండ్ల పంపిణీతో సురేష్ యాదవ్ జన్మదిన వేడుకలు



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో జరుపుకుంటూ మానవత్వాన్ని చాటుకున్నారు మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పోచబోయిన సురేష్ యాదవ్. తన జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని అమ్మ చేయూత ఫౌండేషన్ -ఓల్డ్ ఏజ్ హోమ్ సెంటర్‌ను సందర్శించిన ఆయన.. అక్కడి వృద్ధులు, చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధులకు అన్నదానం నిర్వహించి, చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం వృద్ధుల ఆశీస్సులు తీసుకుని, చిన్నారులతో కొంతసేపు ఆప్యాయంగా గడిపారు. దీంతో ఆశ్రమంలో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా సురేష్ యాదవ్ మాట్లాడుతూ.. జన్మదినం అంటే కేవలం వేడుక చేసుకోవడం కాకుండా, నలుగురి జీవితాల్లో కొంత ఆనందాన్ని పంచడమే తనకు నిజమైన సంతోషమని అన్నారు. వృద్ధుల ఆశీస్సులు పొందడం, చిన్నారులతో సమయం గడపడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు.సమాజంలో ఆప్యాయత, మానవత్వం, సేవాభావం మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పేదలు, వృద్ధులు, అనాథలు, అవసరంలో ఉన్న వారికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ భవిష్యత్‌లోనూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని సురేష్ యాదవ్ తెలిపారు. ఆర్భాటం కంటే ఆప్యాయత.. వేడుకల కంటే సేవ అనే సందేశాన్ని తన జన్మదిన వేడుకల ద్వారా చాటిన సురేష్ యాదవ్‌ను ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

## సిపిఎం పార్టీ కొరకు నిరంతరం కృషి చేసిన కోట బక్కయ్య కు జోహార్లు



**మునగాల :విశాల భారతి :** మండల పరిధిలోని నరసింహుల గూడెం గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కోట బక్కయ్య గారి మరణం నరసింహుల గూడెం గ్రామానికి తీరని లోటు అని కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు అన్నారు ఆదివారం నరసింహుల గూడెం గ్రామంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట గోపి తండ్రి కోట బక్కయ్య ప్రధమ వార్షికం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లా వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడుతూ నరసింహుల గూడెం గ్రామానికి కోట బక్కయ్య చేసిన సేవలు మరవరాని అని భవిష్యత్తులో వారి సేవలు వారి కుమారులైన కోట గోపి ద్వారా సేవా కార్యక్రమాలు చేయుటకు ప్రజలందరూ అంకితభావంతో పనిచేయాలని కొనియాడారు ఇట్టి కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట గోపి సృజన జిల్లెపల్లి సైదుబాబు మనీ జె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## యాదవ్ నగర్ నేరడలో బోర్ వెల్ పరిసరాల పరిశుభ్రత



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ షేక్ జానీ ఆధ్వర్యంలో యాదవ్ నగర్ పరిధిలోని స్థానిక బోర్ వెల్ సమీపంలో పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఆదివారం తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రపరచడం జరిగింది. దీర్ఘకాలంగా బోర్ వెల్ చుట్టూ పిచ్చి మొక్కలు దట్టంగా పెరగడంతో స్థానిక ప్రజలు, నీటి కోసం వచ్చేవారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన సొసైటీ చైర్మన్ షేక్ జానీ స్వయంగా స్పందించి, శ్రమదానంతో ఆ ప్రాంతమంతటినీ శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా షేక్ జానీ మాట్లాడుతూ... "పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని, మంచినీటి వనరుల వద్ద పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చూసేందుకు తమ సొసైటీ ఎల్లప్పుడూ ముందుంటుంది" అని తెలిపారు. బోర్ వెల్ పరిసరాలను బాగు చేయించినందుకు గాను యాదవ్ నగర్ నివాసితులు సొసైటీ సభ్యులకు, చైర్మన్ షేక్ జానీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## గాంధీజీ ప్రశంసా పత్రాలు సాధించిన విద్యార్థి, ఉపాధ్యాయురాలు



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** గాంధీ జయంతి సందర్భంగా గాంధీ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో సూదనపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రతిభ చాటింది. "ప్రపంచ శాంతి గాంధీ మార్గం" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి గంగాధర చందుతో పాటు, జిల్లా వ్యాప్తంగా ఈ పోటీలను విజవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయురాలు వెంగంటి శుభ శనివారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కె. అనిల్ కుమార్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థి, ఉపాధ్యాయురాలు జిల్లా స్థాయిలో ప్రశంసా పత్రాలు సాధించడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకన్న, ఉపాధ్యాయ బృందం సంతోషం వ్యక్తం చేస్తూ విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు ఇలాంటి పోటీలలో పాల్గొని తమ ప్రతిభను వెలికితీసుకోవాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

## జాగృతి, భవితలకు ఆశీస్సులు అందించిన టీయూడబ్ల్యూజే ఐజేయూ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్;** పట్టణంలోని నందన గార్డెన్స్‌లో ఆరెపాక రాజేష్-విజయలక్ష్మి దంపతుల కుమార్తెలు జాగృతి, భవితల నూతన వస్త్రాలంకరణ వేడుక ఘనంగా జరిగింది. ఈ వేడుకకు టీయూడబ్ల్యూజే ఐజేయూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా జాగృతి, భవితలకు నూతన వస్త్రాలు ధరింపజేసి, వారి భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని సిహెచ్ శ్రీనివాస్ ఆకాంక్షించారు. చిన్నారులు విద్యలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ ఆశీస్సులు అందజేశారు. కుటుంబ సభ్యులు, బంధువులు, ఆత్మీయులు, సన్నిహితుల సమక్షంలో వేడుక ఆనందోత్సాహాల మధ్య జరిగింది. ఈ సందర్భంగా వేడుకకు హాజరై చిన్నారులను ఆశీర్వదించిన సిహెచ్ శ్రీనివాస్‌కు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## దుకాణాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు.. మరమ్మతులతో భద్రతకు భరోసా



**మోటకొండూర్, విశాల భారతి:** మోటకొండూర్‌లో దుకాణాల యజమానుల సహకారంతో సీసీ కెమెరాల ఏర్పాటు, మరమ్మతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. దుకాణాలు, ప్రధాన రహదారులు, రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా పెంచడం వల్ల దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో పనిచేయని వాటిని పరిశీలించి మరమ్మతులు చేపట్టారు. దుకాణాల యజమానులు తమ వ్యాపార ప్రదేశాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, వాటిని ఎప్పటికప్పుడు పనిచేసే స్థితిలో ఉంచాలని సూచించారు. ప్రజల భద్రత కోసం దుకాణ యజమానులు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

## మదర్ డైరీ డైరెక్టర్ దొంతిరి సోమిరెడ్డికి హరీష్‌రావు అభినందనలు



**ఆలేరు, విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి చెందిన దొంతిరి సోమిరెడ్డి ఇటీవల జరిగిన మదర్ డైరీ ఎన్నికల్లో డైరెక్టర్‌గా అఖండ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావును సోమిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. మదర్ డైరీ డైరెక్టర్‌గా ఎన్నికైనందుకు అభినందనలు తెలిపి, రైతులు, పాడి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ మదర్ డైరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, ఆలేరు నియోజకవర్గ నాయకులు సిరిగిరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల హక్కులకు భంగం కలిగిస్తున్న ఈసీ..తలసాని



**సికింద్రాబాద్ ,విశాల భారతి :** ఎన్నికల కమిషన్ అనుసరిస్తున్న తీరు ఓటర్ల హక్కులకు తీవ్ర భంగం కలిగించే విధంగా ఉందని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మండిపడ్డారు. సనత్ నగర్ నియోజకవర్గ పరిధిలోని పద్మారావు నగర్ బెల్వర్ది గార్డెన్ అపార్ట్మెంట్ లో ఆదివారం నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రాడ్యుయేట్ ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ మళ్లీ మళ్లీ ఓటరు నమోదు ప్రక్రియను చేపట్టడం ఎందుకని ఈసీని నిలదీశారు. గతంలో నమోదైన వారిని కొనసాగిస్తూ, కేవలం కొత్తగా పట్టభద్రులైన వారిని మాత్రమే నమోదు చేసుకునే సరళమైన విధానాన్ని తీసుకురావాలని సూచించారు. టెక్నాలజీ, ప్రక్రియపై సరైన అవగాహన లేని వారిని బీఎల్ఓలుగా నియమించడం వల్ల తీవ్ర గందరగోళం నెలకొందని, ఫలితంగా లక్షలాది మంది అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి గల్లంతయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేర్లు తొలగించిన తర్వాత మళ్లీ వారికే నోటీసులు జారీ చేయడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. ఓటు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు అని, దానిని పరిరక్షించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందని స్పష్టం చేశారు. పెద్ద వ్యవస్థలు ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయాన్ని తీసుకుని ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలని డిమాండ్ చేశారు. త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎన్నికల దృష్ట్యా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి పాలనపై తలసాని తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో ప్రజలు విద్యుత్ కోతలు, తాగునీటి ఎద్దడి వంటి తీవ్ర సమస్యలతో అల్లాడుతుంటే సీఎం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మున్సిపల్, హోం, విద్యాశాఖలను తన వద్దే అట్టిపెట్టుకున్న సీఎం, ఇప్పటివరకు ఆ శాఖల పనితీరుపై కనీస పర్యవేక్షణ కూడా చేయలేదని ఆరోపించారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నానని గొప్పలు చెప్పుకునే ముఖ్యమంత్రి మాట్లాడే భాష సంస్కారహీనంగా ఉందని, ప్రజలంతా ఆయన తీరును గమనిస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిరంతర సమీక్షలతో తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సమర్థవంతంగా పాలన అందించారని గుర్తుచేశారు.

ఈ కార్యక్రమంలో పలువురు గ్రాడ్యుయేట్లు తమ నమోదు పత్రాలను ఎమ్మెల్యే తలసానికి అందజేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పద్మారావు నగర్ ఇన్‌ఛార్జ్ గుర్రం పవన్ కుమార్ గౌడ్, బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, అపార్ట్మెంట్ ప్రతినిధులు జగ్గయ్య, రాజశేఖర్, ముకుంద్, సత్యనారాయణ, ఆనంద్, ప్రసాద్, పవన్, బాల్ రెడ్డి, డాక్టర్ ఇందిరతో పాటు పార్టీ నేతలు ఏసూరి మహేష్, వెంకటరమణ, శ్రీకాంత్ రెడ్డి, మిట్టపల్లి బాబూరావు, కొత్తూరు వెంకట్, ఎంఎన్ శ్రీనివాస్, కృష్ణ ముదిరాజ్, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా దుర్గా ఉత్సవాలు.. ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక

- **20వ సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం..**
- **అధ్యక్షుడిగా తాడూరు వెంకటేశం**



**చౌటుప్పల్,విశాల భారతి:** పట్టణంలోని గాంధీ పార్క్‌లో శ్రీ దుర్గా ఉత్సవ కమిటీ 20వ సంవత్సరం నూతన కార్యవర్గాన్ని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా చౌటుప్పల్ పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, ముత్యాల హనుమంతు రెడ్డిలను ఎన్నుకోగా, అధ్యక్షుడిగా తాడూరు వెంకటేశం, ప్రధాన కార్యదర్శిగా జక్కర్తి శేఖర్‌ను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తాడూరు వెంకటేశం మాట్లాడుతూ 20వ సంవత్సరం శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కమిటీ సభ్యులు, భక్తులు సహకరించాలని కోరారు.తనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న కమిటీ సభ్యులకు తాడూరు వెంకటేశం కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరి సహకారం తీసుకుంటామని చెప్పారు.

# ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

- **అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దుగంగాధర్**



**నిజామాబాద్ జిల్లా విశాల భారతి;** మాక్లూర్ మండలంలో ఒడ్డట్ పల్లి గ్రామంలో గత 15 సంవత్సరాల నుండి ఇండ్లు లేక నిరుపేదలైనటువంటి వారు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఆదివారం ఒడ్డట్ పల్లిలో విలేకరుల సమావేశంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్య దుడ్డు గంగాధర్ మాట్లాడుతూ గత గ్రామపంచాయతీ పాలకవర్గం ఊరి చివరలో ఉన్న భూమి ఇండ్లు లేని వారికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని అప్పటి సర్పంచ్ తో సహా వార్డ్ నెంబర్లు గ్రామపంచాయతీ తీర్మానం చేసి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు ఇప్పటికీ ఇండ్ల స్థలాలు ఇవ్వక పో వడంలో ఇల్లు లేని వారు అద్దెకిరా ఇళ్లల్లో ఉంటూ కాలం వెళ్ళ లదీస్తున్నారు బాధితులు అధికారుల చుట్టూ తిరిగిన కలెక్టర్ ఆఫీసులో చుట్టూ తిరిగిన లేకుండా పోయింది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇండ్ల స్థలాలు చూపెట్టి ఇల్లు కట్టిస్తామని అధికారంలోకి వచ్చి తీరా బాధితులను వర్తించకూడదు సిగ్గుచేటని అఖిలభారత రైతు కూలి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ అన్నారు ఇకనైనా ప్రభుత్వాధికారులు స్పందించి ఇల్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు నేను పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు ఇండ్లు లేని బాధితులు పాల్గొన్నారు బాధితులు

# మహిళా సర్పంచులను అవమానిస్తే కఠిన చర్యలు తప్పవు

- **అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి హెచ్చరిక**



**చౌటుప్పల్,విశాల భారతి:** గ్రామీణ అభివృద్ధిలో, స్థానిక పరిపాలనలో మహిళా సర్పంచులు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని, అయితే ఇటీవల కొందరు వ్యక్తులు మహిళా సర్పంచుల పట్ల అవమానకరంగా ప్రవర్తించడం తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోందని యాదాద్రి భువనగిరి జిల్లా సర్పంచుల ఫోరం మహిళా అధ్యక్షురాలు, అల్లాపురం సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన మహిళా ప్రజా ప్రతినిధులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజ్యాంగం కల్పించిన హక్కులతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్న మహిళా ప్రతినిధులపై ఇలాంటి చర్యలకు పాల్పడడం రాజ్యాంగ విరుద్ధమని, నేరమని ఆమె స్పష్టం చేశారు.

**వేధింపులకు గురి చేస్తే క్రిమినల్ కేసులు**

మహిళా సర్పంచుల విధులకు అడ్డుపడినా, వారి గౌరవానికి భంగం కలిగేలా మాట్లాడినా, వేధింపులకు గురి చేసినా సంబంధిత వ్యక్తులపై భారతీయ న్యాయ సంహిత మరియు ఇతర చట్టాల కింద కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అసత్య ప్రచారాలు, దుర్భాషలాడడం వంటి చర్యలకు పాల్పడితే సైబర్ క్రైమ్ చట్టాల కింద చర్యలు తప్పవని తెలిపారు.

# హిందూ ముస్లింలు అన్న తేడా లేకుండా బౌన్సర్లకు పని కల్పించాలి



**ముషీరాబాద్,విశాల భారతి:** నగరంలో జరిగే అనేక ఈవెంట్స్ లలో హిందూ ముస్లిం అని తేడా లేకుండా బౌన్సర్స్ కు పని కల్పించాలని పలువురు బౌన్సర్లు కోరారు. తారతమ్యాలు చేసే వారిపై పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి అడిక్ మెట్ కమిటీ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బౌన్సర్లు మొహమ్మద్ ఫిరోజ్, శారదా రెడ్డి, షేక్ సల్మాన్, ప్రభాకర్, మొహమ్మద్ ఇబ్రహీం ఖాన్, సంజనాలు మాట్లాడుతూ ఈవెంట్స్ లలో బౌన్సర్లు శక్తికి మించి కష్టపడి పనిచేస్తున్నారని కులాలు మతాలు అన్న తారతమ్యం ఇటీవల కొందరు వ్యత్యాసాలు సృష్టిస్తున్నారని తెలిపారు. ఎవరో చేసే అంతరానికి మొత్తం వ్యవస్థను తప్పు పట్టడం సరికాదని తప్పు చేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కుల మతాల భేదం లేకుండా కొనసాగుతున్న రాష్ట్రాన్ని మతం మరకలు అంటించడం విచారకరమన్నారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి, డిజిపిలు కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. దాండియా కార్యక్రమం నుంచి కులం మతం అన్న వ్యత్యాసం మొదలైందని తాము మనుషులమే అనే భావంతో ముందుకు సాగాలని తమకు భౌన్సర్లుగా పని కల్పించాలని కోరారు. ముస్లిం బౌన్సర్లు కు పని కల్పించొద్దంటూ బ్యాక్ డోర్ నుంచి ఒత్తిడి వస్తుందని ఈవెంట్స్ నిర్వాహకులు గత రెండేళ్లుగా చెప్తూ వస్తున్నారని ఇదే పద్ధతి కొనసాగితే బౌన్సర్ల పరిస్థితి రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం బౌన్సర్లుగా పని కల్పించరాదు అంటూ ఒత్తిడి చేసే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

# సెల్‌ఫోన్.. బైక్ తాళాలు ఇంట్లోనే.. మెకానిక్ మాయం!

- **రంగనాయకులగుట్టకు చెందిన షేక్ బాషా అదృశ్యం**
- **ఆచూకీ కోసం హయత్‌నగర్ పోలీసుల గాలింపు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మెకానిక్ అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. రంగనాయకులగుట్ట ప్రాంతానికి చెందిన షేక్ బాషా (38) అకస్మాత్తుగా కనిపించకుండా పోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య వివరాలు వెల్లడిస్తూ.. షేక్ బాషా ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చేపట్టినట్లు తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ బాషా అక్టోబర్ 3వ తేదీ రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. అదే రోజు రాత్రి సుమారు 9.30 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించగా కుటుంబ సభ్యులు ఆయన బైక్ తాళాలు, సెల్‌ఫోన్ తీసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులు నిద్రపోయారు. అక్టోబర్ 4వ తేదీ ఉదయం సుమారు 7 గంటలకు కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా షేక్ బాషా ఇంట్లో కనిపించలేదు. అయితే ఆయన సెల్‌ఫోన్, బైక్ తాళాలు మాత్రం ఇంట్లోనే ఉండటంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. వెంటనే పరిసర ప్రాంతాలతో పాటు బంధువులు, స్నేహితుల వద్ద ఆరా తీసి వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు హయత్‌నగర్ పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేసి షేక్ బాషా ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లి ఉంటాడనే కోణంలో పరిసర ప్రాంతాల్లో ఆరా తీస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శంకరయ్య తెలిపారు. షేక్ బాషా ఆచూకీ తెలిసిన వారు లేదా ఆయనను ఎక్కడైనా చూసిన వారు వెంటనే హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని ఇన్‌స్పెక్టర్ శంకరయ్య విజ్ఞప్తి చేశారు. సమాచారం తెలిసిన వారు 8712662640 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# తెలంగాణ మట్టి బిడ్డల స్ఫూర్తితోనే జనసేన ఆవిర్భావం డా.గడల శ్రీనివాసరావు



**చౌటుప్పల్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి జనసేన సమావేశం**

**చౌటుప్పల్,విశాల భారతి:** తెలంగాణ మట్టి బిడ్డల నుంచి పొందిన స్ఫూర్తితోనే పవన్ కల్యాణ్ సారథ్యంలో జనసేన పార్టీ ఈ రాష్ట్రంలోనే ఆవిర్భవించిందని పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, నల్గొండఖమ్మంవరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా. గడల శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఆదివారం చౌటుప్పల్‌లోని జయశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. 1200 మంది యువత బలిదానంతో ఏర్పడిన తెలంగాణలో 10 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ హామీలు అమలు చేయకుండా ఫాంహౌస్‌కే పరిమితమైందని, ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, స్కూటీలు, మహిళలకు నెలకు రూ.2500, జాబ్ క్యాలెండర్ అంటూ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మూడేళ్లయినా 20 శాతం హామీలు కూడా అమలు చేయలేదని విమర్శించారు.రాష్ట్రంలో 30 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, కామారెడ్డి డిక్లరేషన్ ఏమైందని ప్రశ్నించారు.బీఆర్ఎస్ 10 ఏళ్ల అరణ్యవాసం, కాంగ్రెస్ 3 ఏళ్ల అజ్ఞాతవాసం పూర్తయ్యాయని, అందుకే జనసేన రంగంలోకి దిగి ప్రశ్నిస్తుందని అన్నారు. జనసేన అధికారంలోకి వస్తేనే సామాజిక న్యాయం జరుగుతుందని, ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు పార్టీకి సెమీఫైనల్స్ లాంటివని, ఉద్యమాల పురిటిగడ్డ నల్గొండ నుంచి ఎన్నికల యుద్ధాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. పవన్ కల్యాణ్ వస్తే ప్రళయం వస్తుందని వ్యాఖ్యానించారు.

**రూ.లక్ష విరాళం అందజేత**

జనసేన ఉమ్మడి నల్గొండ జిల్లా నాయకుడు ఆముదాల పరమేశ్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిమిత్తం రూ. లక్ష విరాళం చెక్కును వేదికపై అభ్యర్థికి అందజేశారు. అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయించిన నాయకులను సన్మానించారు.కార్యక్రమంలో జాయినింగ్ కమిటీ కన్వీనర్ మమ్మురెడ్డి ప్రేమ్ కుమార్, రాష్ట్ర నాయకులు మచ్చ సుధాకర్, శర్మ, శిరీష, ప్రజిత్ గౌడ్, మిర్యాల రామకృష్ణ, శివ కార్తీక్, లక్ష్మణ్ గౌడ్, పీక ప్రవీణ్, మామిడాల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఆరోగ్య భద్రతపై ఉద్యమం

- **అక్టోబర్ 5న అంబేద్కర్ చౌరస్తాలో పోస్టుకార్డు ఉద్యమం**
- **టీయూడబ్ల్యూజే (హెచ్-143) తెంజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు వరికుప్పల అశోక్**



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, సంక్షేమం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ దశలవారీగా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు టీయూడబ్ల్యూజే (హెచ్ 143) తెంజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు వరికుప్పల అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఆరోగ్య భద్రత, సంక్షేమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా సంఘటితంగా పోరాటం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కమిటీ నిర్ణయించిందని తెలిపారు. ఉద్యమంలో భాగంగా అక్టోబర్ 5న సోమవారం ఉదయం 9 గంటలకు ఇబ్రహీంపట్నం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పోస్టుకార్డు ఉద్యమం నిర్వహిస్తున్నట్లు అశోక్ వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు సూరమోని సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే (హెచ్ 143 )తెంజు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు వరికుప్పల అశోక్ ఆధ్వర్యం వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టులందరూ ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరై తమ ఐక్యతను చాటాలని అశోక్ పిలుపునిచ్చారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, సంక్షేమం కోసం చేపడుతున్న ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# ఓబీసీ హక్కుల కోసం కదిలిన మహేశ్వరం.. సింహ గర్జనకు భారీ ర్యాలీ

- **గొల్లపల్లిలో ఓబీసీ సింహ గర్జన సభకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు**
- **భారీ వాహన ర్యాలీగా బయలుదేరిన ఓబీసీ బంధువులు**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఓబీసీల హక్కుల సాధన, సామాజిక న్యాయం కోసం నిర్వహిస్తున్న ఓబీసీ సింహ గర్జనకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి భారీ స్పందన లభించింది. శంషాబాద్ మండలం గొల్లపల్లిలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు మహేశ్వరం నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, ఓబీసీ బంధువులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఎన్టీఆర్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నుంచి మహేశ్వరం నియోజకవర్గం, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ వాహన ర్యాలీగా బయలుదేరారు. పెద్ద సంఖ్యలో వాహనాలు, కార్యకర్తలు, ఓబీసీ వర్గాల ప్రజలు ర్యాలీలో పాల్గొని తమ ఐక్యతను చాటారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఓబీసీలకు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో న్యాయమైన వాటా దక్కేలా హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఓబీసీల సమస్యలు, హక్కులు, రిజర్వేషన్లు, సంక్షేమ అంశాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ఓబీసీ వర్గాల ప్రజలు తరలిరావడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఓబీసీల హక్కుల సాధన కోసం భవిష్యత్‌లోనూ ఐక్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల నాయకులు, ఓబీసీ ప్రతినిధులు, యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలు మూడు నెలల్లో భర్తీ చేయాలి

- **డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్,**
- **ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్**



**ముషీరాబాద్, విశాల భారతి:** వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాలు మూడు నెలల్లో భర్తీ చేయాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ రాష్ట్ర అధ్యక్షులు వల్లభనేని ప్రసాద్, ఉపాధ్యక్షులు కాటమోని వెంకటేష్ గౌడ్ లు కోరారు. ఈ మేరకు వికలాంగుల సంక్షేమ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ను తన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వల్లభనేని ప్రసాద్ , వెంకటేష్ లు మాట్లాడుతూ. జీవో నెంబర్ 19 ప్రకారం వికలాంగుల బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీని మూడు నెలల్లో పూర్తి చేయాలని ఉద్యోగాలు నోటిఫికేషన్ లో ఎలాంటి బోగస్ సర్టిఫికెట్లు లేకుండా న్యాయం చేయాలని కోరారు. అసలైన వికలాంగులకు తగు న్యాయం చేసి ఉద్యోగాల ఎంపిక చేసి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్ కుమార్, సుక్కయ్య, ఆజాం, సయ్యద్ జాకర్, తదితరులు పాల్గొన్నారు.

# సంచార ముస్లింలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- **సంచార ముస్లిం తెగ జేఏసీ చైర్మన్ సైదా ఖాన్**



**ముషీరాబాద్,విశాల భారతి:** సంచార ముస్లింలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంచార ముస్లిం తెగ జేఏసీ చైర్మన్ సైదా ఖాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సంచార ముస్లిం బీసీ ఈ 14 తెగల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ గా సైదా ఖాన్ ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి సంచార ముస్లింలకు ప్రభుత్వాల నుంచి ఆశించిన స్థాయిలో ప్రయోజనాలు అందలేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలోనూ న్యాయం జరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడిచినా సంక్షేమ చర్యలు చేపట్టలేదని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా వారి అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు. విద్యకు దూరమైన వారికి విద్య, నిరుద్యోగులకు ఉపాధి, ఇళ్లు లేనివారికి గృహాలు కల్పించాలని కోరారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌గా ఫరీద్, ప్రధాన కార్యదర్శిగా మసూద్, కోశాధికారిగా ఇమాం పాషా, గౌరవ సలహాదారుగా సలీమ్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు.

# ట్యాంక్ బండ్ పైన ఏకలవ్యుడి విగ్రహం ఏర్పాటు చేయాలి

- **తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు కూరాకుల కృష్ణ**



**ముషీరాబాద్, విశాల భారతి:** ట్యాంక్ బండ్ పైన ఏకలవ్యుడి విగ్రహం ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్ రాష్ట్ర అధ్యక్షులు కూరాకుల కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం బాగ్ లింగం పల్లి లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో పాటు ఎస్టీ జాబితాలో రాజకీయ ప్రాతినిధ్యం, తగిన రాజకీయ అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. సంఘాన్ని రాష్ట్రస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు బలోపేతం చేసి జిల్లా, మండల, గ్రామ కమిటీలను ఏర్పాటు చేసి సంఘటితంగా హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.ఎరుకల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, గురుకులాల్లో ప్రవేశాలు, పోటీ పరీక్షలకు కోచింగ్ వంటి సదుపాయాలు అందేలా కృషి చేయాలని కోరారు. ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ధర్మ, దేవరాయ సుధాకర్, కూరాకుల కిషన్‌లాల్, కూడాడి పాండు, శ్రీరాం శివకుమార్, నిమ్మ చంద్రయ్య, పుచ్చిత మల్లేష్, దేవసాని కృష్ణ, కోట సుజాత, కూరాకుల సరస్వతి, మాన్పాటి శైలజ, కూడాడి అనసూయ, ముద్దనోళ్ల శ్రీనివాస్, ముద్దనోళ్ల బాలయ్య, రాగికి అనంతప్ప, నల్లగొండ భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భద్రత కల్పించి దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- **టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాయి శ్రావణ్ రెడ్డి**



**హైదరాబాద్, విశాల భారతి:** తనపై దాడులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని భద్రత కల్పించాలని మల్లాపూర్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాయి శ్రవణ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తనపై వరుసగా జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం మల్లాపూర్ లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 రోజులుగా తాను వెళ్లే ప్రాంతాల్లో కొందరు అనుసరిస్తూ దాడులకు పాల్పడుతున్నారని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో అద్దాలు ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటనలకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు ఆయన అనుచరులే కారణమని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై నాచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, జరిగిన మూడు ఘటనలకు సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఘటనలపై రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, డీజీ మహేష్ భగవత్, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తనకు ఎలాంటి ఇబ్బంది లేదా ప్రాణహాని జరిగినా అందుకు స్థానిక కాంగ్రెస్ నాయకుడు బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

# మానుకోట భూములకు కబ్జా కోరలు

- మానుకోటలో భూకంపం పుట్టిస్తున్న భూకబ్జా బాగోతం
- రికార్డులు తిరగేస్తే బయటపడనున్న భూముల గుట్టు
- ప్రభుత్వ భూములే టార్గెట్
- అక్రమార్కుల ఆగడాలకు అడ్డే లేదా?
- రికార్డుల్లో వందల ఎకరాలు
- క్షేత్రస్థాయిలో భూముల ఆచూకీపై అనుమానాలు



**మహబూబాబాద్ జిల్లా విశాల భారతి; జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** "పుట్టేటప్పుడు ఏమి తీసుకురాడు.. చచ్చేటప్పుడు ఏమి తీసుకుపోడు" అనే కనీస నిజాన్ని మరిచి, నూతన సమాజంలో కొందరు అక్రమార్కులు స్వార్థం కోసం నీచమైన పనులకు దిగజారుతున్నారు. డబ్బు కోసం పచ్చని చెట్లను నరికేస్తూ, భూములను కబ్జా చేస్తూ, దొంగతనాలు, దోపిడీలు, అక్రమ వ్యాపారాలకు తెగబడుతున్నారు. చివరికి పైసల కోసం కన్న తల్లిదండ్రులను సైతం చంపేసేందుకు వెనుకాడడం లేదు. ఇలాంటి స్వార్థపరులు కొందరు రాజకీయ అండదండలతో రెచ్చిపోతూ.. ఏకంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంతో పాటు కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములకే ఎసరు పెట్టారు.

**అభివృద్ధికి 'సెంట్' స్థలం లేదంటున్న రెవిన్యూ..**

* రికార్డుల్లో వేలాది ఎకరాలు అన్యాక్రాంతం!

ప్రభుత్వ భూమి యథేచ్ఛగా కబ్జాలకు గురికావడంతో, జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి పనులకు, నూతన భవనాల నిర్మాణానికి సెంట్ భూమి కూడా లేదంటూ రెవిన్యూ అధికారులు చేతులెత్తేస్తున్నారు. కానీ రికార్డుల ప్రకారం చూస్తే వేలాది ఎకరాల అసైండ్, భూదాన్, పి.ఓ.టి, అబాద్, సీలింగ్ భూములతో పాటు చెరువులు, కుంటలు, కాల్వలు, గుట్టలు, అడవులు సైతం అన్యాక్రాంతమవుతున్నాయి. "అవినీతిని అంతం చేస్తాం.., ప్రభుత్వ భూములను కాపాడుతాం" అంటూ ఎన్నికల్లో గెలుపొందిన నాయకులు.. నేడు కబ్జాదారులతో చేతులు కలిపి చూసీచూడనట్లు వదిలేస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా స్థాయి అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంతో, ప్రజా సంఘాలు, సామాజికవేత్తలు ముందుకు వచ్చి మహబూబాబాద్ జిల్లాలో ప్రభుత్వ భూములపై మరో పోరాటానికి తెరలేపారు.

**మహబూబాబాద్ పరిధిలో రౌండ్ టేబుల్ సమావేశం : ఉద్యమానికి పిలుపు.**

ఇటీవల మహబూబాబాద్ మున్సిపాలిటీ రెవిన్యూ పరిధిలో ప్రభుత్వ భూములను కాపాడాలని ప్రజా సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. సర్వే నెంబర్ 107 తో పాటు ఇతర ప్రభుత్వ భూముల పరిరక్షణకై ఈ సమావేశంలో ఎలెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ బీమా నాయక్, రాజేష్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు నాయక్, అంబేద్కర్ యువజన జిల్లా కార్యదర్శి నీరుడు సామెల్, గోర్ సిక్వడి జిల్లా నాయకుడు బిచ్చు చవాన్, ఎలెచ్పీఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు స్వర్ణలత, వికలాంగుల విభాగం నాయకుడు రాందాస్ నాయక్, దొరల హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎలెచ్పీఎస్ జిల్లా నాయకులు విష్ణు నాయక్, శ్రీను, మంగీలాల్, సుమన్, సాయిలు, తదితరులు పాల్గొని మరో పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. మరో పక్కా సామాజికవేత్త గండమాల రామకృష్ణ (సర్వే నెంబర్ 287)పై ఇప్పటికే లోకాయుక్త కోర్టును ఆశ్రయించిన విషయం విధితమే.

**కురవిలో భూమి లేదనడం అబద్ధం.. ఆధారాలతో సహా నిరూపించిన నూతక్కి సాంబశివరావు !**

మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కురవి మేజర్ గ్రామ పంచాయతీ రెవిన్యూ పరిధిలో హరిత హోటల్, వివిధ ప్రభుత్వ భవనాలు మంజూరయ్యాయి. అయితే, కురవి పరిధిలో అసలు ప్రభుత్వ భూములే లేవని రెవిన్యూ అధికారులు తేల్చిచెప్పారు. ఈ కారణంగానే కురవి మండల కేంద్రంలో నిర్మించాల్సిన మోడల్ స్కూల్, ఆశ్రమ పాఠశాలలను చివరకు నేరడలో నిర్మించాల్సి వచ్చింది. వాస్తవానికి ప్రభుత్వ భూమి లేదా? ఉందా? అనే సందేహంతో కురవి మేజర్ గ్రామ పంచాయతీ సీనియర్ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు రికార్డుల పరంగా ఆధారాలను వెలికి తీశారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన.. కురవి పరిధిలో మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమి ఉందని సాక్ష్యాలతో సహా బట్టబయలు చేశారు. ఈ విషయమై ఆయన జిల్లా కలెక్టర్‌కు, ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశారు.

**నిబంధనలకు విరుద్ధంగా నోటీసులు..**

* దళిత నాయకుల నిరసనతో సర్వే వాయిదా!

మరోవైపు కురవి పరిధిలోని సర్వే నెంబర్ 177 బై నెంబర్లలో జరిగిన కబ్జాలపై దళిత నాయకులు దైద భద్రయ్య, ఇరుగు వెంకన్న, కిన్నెర మల్లయ్య లు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ కురవి భూములను పరిశీలించి, కొలతలు వేస్తామని హామీ ఇచ్చారు. అయితే, శనివారం అధికారులు సర్వే చేసేందుకు వస్తూ నిబంధనలకు విరుద్ధంగా నోటీసులు జారీ చేయడంతో దళిత నాయకులు తీవ్రంగా వ్యతిరేకించారు. దీంతో శనివారం జరగాల్సిన సర్వే వాయిదా పడింది.


Today

CMOHYD

Erra Nageshwar Rao letter dated 01/10/2026 submitted to Hon'ble Chief Minister is forwarded to Revenue Department vide Ref. No. 8648/GEN-GP/2026.

From
CMO - Telangana

**పాఠశాల భూమినీ వదలని అక్రమార్కులు :**

*** 3 ఎకరాల 30 గుంటల జాడెక్కడ?**

అక్రమార్కులు చివరికి విద్యాబోధన చేసే కురవి పాఠశాల భూములను కూడా వదల్లేదు. సర్వే నెంబర్లు 742, 743, 744, 527/ఎ, 528/ఎ, 529, 529/ఎ2/2 ల పరిధిలోని అత్యంత విలువైన ప్రభుత్వ స్థలం పక్కదారి పట్టింది. రికార్డుల ప్రకారం ఇక్కడ 9 ఎకరాల 30 గుంటల భూమి ఉండాలి. కానీ, క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే విస్తీర్ణం చాలా వరకు తగ్గింది. ఇందులో దాదాపు 3 ఎకరాల 30 గుంటల భూమి మాయమైనట్లు తెలుస్తోంది. దీనిపై ప్రశ్నలు ముదురుతుండటంతో, పాఠశాల భూమి లెక్క తేల్చాలని కోరుతూ పూర్వ విద్యార్థి అయిన నూతక్కి సాంబశివరావు నేడు ప్రజావాణిలో ఫిర్యాదు చేయనున్నారు.

**ప్రభుత్వానికి పిర్యాదు : నూతక్కి సాంబశివరావు**

గత 5 రోజుల క్రితమే కురవిలో ప్రభుత్వ భూముల కబ్జాలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ కురవి మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ ఎర్ర నాగేశ్వరావుతో పాటు పలు వార్డు సభ్యుల అంగీకారం మేరకు రెవిన్యూ అదారాలతో రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర రెవిన్యూ ప్రధాన అధికారి, రెవిన్యూ మంత్రి, రాష్ట్ర చీఫ్ సెక్రటరీలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఫిర్యాదులు పంపినట్లు కురవి గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు నూతక్కి సాంబశివరావు తెలిపారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి అక్రమ కబ్జాలను తొలగించకపోతే, త్వరలోనే ఈ వ్యవహారంపై "హైకోర్టు" మెట్లు ఎక్కనున్నట్లు ఆయన హెచ్చరించారు.

## విద్యార్థుల భవితకు పెట్టే పెట్టుబడి సమాజాభివృద్ధికి పునాది

- ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతున్నాం
- ఆరుట్ల టీపీఎస్ తరహాలో నియోజకవర్గంలో మరిన్ని బడులు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఇంజాపూర్‌లో రూ.54లక్షలతో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** విద్యార్థుల భవిష్యత్తు కోసం చేసే పెట్టుబడి సమాజ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి గారు పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యావసతులు కల్పించే లక్ష్యంతో ఆదివారం ఇంజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో రూ.54లక్షలతో అదనపు తరగతి గదులకు ఆయన శంకుస్థాపన చేశారు. సర్కార్ బడులను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు, అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే రాష్ట్రంలోనే తొలి టీపీఎస్‌ను ఆరుట్లలో ఏర్పాటు చేశామని, అక్కడ 'నో అడ్మిషన్' బోర్డు పెట్టినట్లు చెప్పారు. ఈ తరహా విద్యాకేంద్రాలు మరిన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి సి సి బి చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య, కౌన్సిలర్లు ధనరాజ్ గౌడ్, కాకుమాను సునీల్, కుష్కు ఐలయ్య కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యువజన కాంగ్రెస్‌లోకి భారీగా యువత చేరికలు

- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నూతనంగా ఏర్పడిన జీఎస్ఐ డివిజన్‌లో యువజన కాంగ్రెస్‌లోకి భారీగా యువత చేరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పోచబోయిన వినోద్ యాదవ్ ఆధ్వర్యంలో పలువురు యువకులు యువజన కాంగ్రెస్‌లో చేరగా, రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జక్కిడి శివచరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. యువజన కాంగ్రెస్‌లో పనిచేసిన అనేక మంది నాయకులు నేడు వివిధ స్థాయిల్లో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారని తెలిపారు. నూతనంగా పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని కోరారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని యువజన కాంగ్రెస్ శ్రేణులు ఓటరు నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి పెద్ద సంఖ్యలో ఓటర్లుగా నమోదు చేయించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. అనంతరం జీఎస్ఐ డివిజన్ యువజన అధ్యక్షుడిగా చిర్రబోయిన జైకృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా రాకేష్, కళ్యాణ్, రోహిత్, కార్యదర్శులుగా ఫిరోజ్, శివసాయి, సంయుక్త కార్యదర్శిగా రితీష్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా భవానీ శంకర్‌లను నియమించారు. వారికి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే లింగోజిగూడ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణేష్ గౌడ్‌ను నియమించి నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ యరమల రామచంద్రారెడ్డి, జీఎస్ఐ డివిజన్ నాయకులు లోకేశ్, ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షులు శివకుమార్, మిద్దెల భగత్, సామలేటి సాయి, సంజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్ ఆస్పత్రి ఎదుట సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా భారీ బ్యానర్లు

- కలకలం రేపుతున్న 'రూ. 13,200 కోట్ల' ఫ్లెక్సీలు




**సికింద్రాబాద్, విశాల భారతి :** సికింద్రాబాద్‌లోని మెడికవర్ ఆస్పత్రి పరిసరాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వెలసిన భారీ బ్యానర్లు తీవ్ర రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆస్పత్రి ఎదుట ప్రధాన రహదారికి ఇరువైపులా వివాదాస్పద రీతిలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, హోర్డింగులను ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచి స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ బ్యానర్లపై "రేవంత్ రెడ్డిస్ సన్ ఇన్ లాస్" (Revanth Reddy's Sonin law's) అనే శీర్షికతో పాటు, ముఖ్యమంత్రి ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న పలు చిత్రాలను ముద్రించారు. అంతేకాకుండా దిగువన "మెడికవర్.. కంగ్రాట్యులేషన్స్ రేవంత్ గారు.. ఫర్ రూ. 13,200 క్రోర్స్" అంటూ వ్యంగ్యంగా రాసి ఉన్న రాతలు నగరంలో దుమారం రేపుతున్నాయి. మెడికవర్ ఆస్పత్రి లావాదేవీలు, భారీ మొత్తంలో నిధుల మళ్లింపు వ్యవహారాలు జరిగాయంటూ ప్రతిపక్ష నేతలు ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలోనే ఈ తరహా ఫ్లెక్సీలు ప్రత్యక్షమైనట్లు భావిస్తున్నారు. రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు వెంబడి, పెట్రోల్ బంకులు, ఆస్పత్రి ముఖద్వారం సమీపంలో వరుసపెట్టి వీటిని నిలబెట్టడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు విస్మయానికి గురవుతున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. ఇంత భారీ స్థాయిలో నడిబొడ్డున ఉన్న రోడ్లపై బ్యానర్లు ఎవరు ఏర్పాటు చేశారనే కోణంలో దర్యాప్తును ముమ్మరం చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలిస్తూ నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. అధికార కాంగ్రెస్ శ్రేణులు ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తుండగా, నగరంలో ఒక్కసారిగా వెలిసిన ఈ ఫ్లెక్సీలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనానికి తెరతీశాయి.

## సెల్‌ఫోన్ ఆశ చూపి పసికందుపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

- లోయపల్లి ఘటనలో 48 గంటల్లోనే నిందితుడి అరెస్ట్



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** మంచాల మండలం లోయపల్లి గ్రామంలో నాలుగేళ్ల పసికందుపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్కు తరలించారు. ఘటన జరిగిన 48 గంటల్లోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మంచాల సీఐ మధు తెలిపిన వివరాల ప్రకారం.. లోయపల్లి గ్రామానికి చెందిన వెల్డింగ్ కార్మికుడు బైవికాడి నరేందర్ గౌడ్ అలియాస్ నాని (40) ఇంటి వద్ద ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారికి సెల్‌ఫోన్ చూపించి లైంగిక దాడికి యత్నించినట్లు తెలిపారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు క్రైమ్ నంబర్ 261/2026 కింద కేసు నమోదు చేశారు. ఘటన అనంతరం పరారైన నిందితుడు నరేందర్ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం నిందితుడిని శనివారం (అక్టోబర్ 3న) న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్కు తరలించినట్లు వివరించారు. పసికందులపై ఇలాంటి ఘోరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మధు హెచ్చరించారు.

## అంబానగర్‌లో చెట్టు బొంత పురుగుల సమస్యపై స్పందించిన

- బిఆర్ఎస్ నాయకులు - మంద జగన్



**సికింద్రాబాద్, విశాల భారతి :** అంబానగర్‌లో చెట్టు బొంత పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని స్థానికులు బస్తీ వాసులు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న బౌద్ధ నగర్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు, మాజీ వార్డు మెంబర్ మంద జగన్ అంబానగర్ అధ్యక్షులు కొండ కిషోర్ గౌడ్ అక్కడికి చేరుకొని సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు జిహెచ్ఎంసి అధికారులతో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాక స్వామి, పిల్లి వెంకటేష్, జక్కా జగన్మోహన్ దాస్, బొడిగె బిక్షపతి, పిల్లి సత్తెమ్మ, శ్రీనివాస్ గౌడ్, పిల్లి లింగం తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

- 5 లీటర్ల కాచిన సారా స్వాధీనం



**కురవి విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్:** నాటు సారా విక్రయిస్తున్న మహిళను కురవి పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి రూ.2 వేల విలువైన 5 లీటర్ల కాచిన సారాను స్వాధీనం చేసుకున్నారు. కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లింగ్యా తండా (బలపాల)లో ఆదివారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లింగ్యా తండాలో కురవి పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ బి. యుగేందర్ (1002), కానిస్టేబుళ్లు 1787, 3717, మహిళా కానిస్టేబుల్ 1773 పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అదే తండాకు చెందిన మాలోతు భద్రి (45), భర్త బుచ్చ నాటు సారా విక్రయిస్తుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ఆమె వద్ద ఉన్న 5 లీటర్ల కాచిన సారాను సీజ్ చేశారు. ఈ మేరకు మాలోతు భద్రిపై క్రైమ్ నంబర్ 203/2026 కింద టీఎస్‌పీఏ చట్టంలోని సెక్షన్ 7(ఎ) రెడ్‌విత్ 8(ఈ) ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## ఆటో, ట్యాక్సీల కనీస ఛార్జీలు పెంచాలి

- జీఓ 46ను రద్దు చేసి కనీస ఛార్జీ రూ.50, కిలోమీటర్‌కు రూ.20 చేయాలి



**సికింద్రాబాద్, విశాల భారతి :** ఆటో డ్రైవర్ల సమస్యలపై తెలంగాణ ఆటో యూనియన్స్ ఫెడరేషన్ నాయకులు సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జీఓ నంబర్ 46 ప్రకారం ఆటోలు, ట్యాక్సీలకు కనీస ఛార్జీ రూ.30గా, కిలోమీటర్‌కు రూ.14గా నిర్ణయించారని యూనియన్ నాయకులు తెలిపారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ ఛార్జీలు సరిపోవడం లేదని పేర్కొంటూ, జీఓ 46ను రద్దు చేసి ఆటోలు, ట్యాక్సీలకు కనీస ఛార్జీ రూ.50గా, కిలోమీటర్‌కు రూ.20గా నిర్ణయించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని పలు బజాజ్ షోరూమ్‌లలో కొత్త ఆటో వాహనాలను ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయిస్తున్నారని యూనియన్ నాయకులు ఆరోపించారు. కొంతమంది వినియోగదారుల నుంచి ఎంఆర్‌పీకి అదనంగా సుమారు రూ.50,000 వరకు వసూలు చేస్తున్నప్పటికీ, సరైన బిల్లు ఇవ్వడం లేదని వారు పేర్కొన్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు వాహనాలను విక్రయిస్తున్న షోరూమ్‌లపై సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఆటో యూనియన్స్ ఫెడరేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు.

## వర్షాల కోసం చిలకలగూడ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు



**సికింద్రాబాద్,విశాల భారతి :** వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ సికింద్రాబాద్ చిలకలగూడ ఈద్గా వద్ద నమాజ్ ఎఇస్తిస్కా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిలకలగూడ జామియా మసీద్ అహ్లే సున్నత్ వల్ జమాత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లిం సమాజానికి చెందిన వెయ్యికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ ఖాజా జియా ఉద్దీన్ సబ్రీ సాహెబ్, సయ్యద్ రిజ్వాన్ పాషా ఖాద్రీ సాహెబ్‌తో పాటు పలువురు ఉలమాలు పాల్గొన్నారు. వర్షాకాలం కొనసాగుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో, ప్రజలకు, రైతులకు ఇబ్బందులు కలగకుండా సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రత్యేక నమాజ్ అనంతరం దువా చేశారు. ఈ సందర్భంగా ముస్లిం సమాజానికి చెందిన పెద్దలు, యువకులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్షాల కోసం ప్రార్థనలు చేశారు.

## 'సీఎంఆర్ఎఫ్' పేరుతో మోసం

**విశాల భారతి, రఘునాథపాలెం:** ముఖ్యమంత్రి సహాయ నిధి పేరుతో కొందరు అమాయకులను నమ్మించి ఓ ఆర్ఎంపీ రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసిన ఘటన ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బూడిదంపాడులో ఆదివారం వెలుగుచూసింది. వివరాలు ఇలా.. బూడిదంపాడు గ్రామానికి చెందిన ఆర్ఎంపీ తోటపల్లి వెంకటేశ్వర్లు తన వద్దకు చికిత్స నిమిత్తం వచ్చే అమాయకులకు మాయమాటలు చెప్పి.. 'మీరు అనారోగ్యంతో దవాఖానలో చేరినందుకు సీఎంఆర్ఎఫ్ పథకం కింద డబ్బులు ఇప్పిస్తా'నని అదే గ్రామానికి చెందిన కాకనబోయిన వెంకటనారాయణ, వరికొల్లు నాగలక్ష్మి, గోళ్ల గురవయ్య, దేశాయి కృష్ణవేణి, సిలివేరు మౌనిక, కౌసల్య, మంగమ్మ, భారతి తదితరుల వద్ద సుమారు రూ.1.50 లక్షలు వసూలు చేశాడు. వీరు చికిత్స పొందిన దవాఖానల నుంచి తానే బిల్లులు తెచ్చి సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసి చెక్కులు ఇప్పిస్తానంటూ నమ్మబలికాడు. ఇలా అనేక మంది వద్ద రూ.15 వేలు చొప్పున వసూలు చేశాడు. అంతేగాక పలు దవాఖానల నుంచి ఫేక్ బిల్లులు సైతం తెచ్చి దరఖాస్తు చేశాడు. తీరా సదరు ఆర్ఎంపీ తెచ్చిన బిల్లులు ఫేక్ అని తేలడంతో దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి.

## ఉపాధ్యాయుల సంక్షేమమే విద్యా వ్యవస్థకు బలమైన పునాది



- ప్రైవేట్ ఉపాధ్యాయులకు గౌరవం, భద్రత, మెరుగైన వేతనాలు కల్పించాలి
- మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి

**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి అన్నారు. విద్యార్థులను కేవలం పాఠ్యాంశాల్లోనే కాకుండా నైతిక విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నంలో నిర్వహించిన జోనల్ స్థాయి ప్రైవేట్ ఉత్తమ ఉపాధ్యాయుల ఆత్మీయ పురస్కార కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను అభినందించి, వారి సేవలను కొనియాడారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రతిరోజూ అనేక సవాళ్లను ఎదుర్కొంటూ విద్యార్థుల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమిస్తున్నారని సుదర్శన్‌రెడ్డి అన్నారు. విద్యార్థుల విజయమే లక్ష్యంగా తమ వ్యక్తిగత ఇబ్బందులను సైతం పక్కనపెట్టి బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుల సేవలకు తగిన గుర్తింపు లభించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సమాజం, విద్యాసంస్థల యాజమాన్యాలు కలిసి పనిచేయాలని సూచించారు. ప్రైవేట్ ఉపాధ్యాయులకు గౌరవప్రదమైన వేతనం, ఉద్యోగ భద్రత, ఆరోగ్య పరిరక్షణ, తగిన సెలవులు, సురక్షితమైన పని వాతావరణం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పనిచేసే ఉపాధ్యాయుల జీవితాల్లో కూడా భరోసా, స్థిరత్వం ఉండాలని ఆయన ఆకాంక్షించారు. పాఠశాలల అభివృద్ధితో పాటు అక్కడ పనిచేసే ఉపాధ్యాయుల సంక్షేమానికి కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చినప్పుడే విద్యారంగం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను సత్కరించడం అభినందనీయమని, ఇలాంటి కార్యక్రమాలు ఉపాధ్యాయుల్లో మరింత స్ఫూర్తిని నింపుతాయని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల జీవితాలను వెలుగుల బాట పట్టిస్తున్న ప్రతి ఉపాధ్యాయుడికి సమాజం గౌరవం ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదిభట్ల మాజీ మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, కౌన్సిలర్లు ముత్యాల శ్యామల భాస్కర్, పొట్టి రాములు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఓటే కీలకం.. ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి




- గత ఎమ్మెల్సీ ఓటు చెల్లదు
- అర్హులైన పట్టభద్రులు కొత్తగా నమోదు చేసుకోవాలి : మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు అత్యంత కీలకమని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా తన ఓటును నమోదు చేసుకోవాలని హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. లెక్చరర్స్ కాలనీ డివిజన్‌లోని వెంకటేశ్వర కాలనీ ప్రముఖ ప్లాజా అపార్ట్‌మెంట్‌లో సామ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమానికి ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్‌లోని పట్టభద్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటు కోసం నమోదు చేసుకున్నారు. అనంతరం కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో ఉన్న ఎమ్మెల్సీ ఓటు ప్రస్తుతం చెల్లుబాటు కాదని, అర్హత కలిగిన పట్టభద్రులు నిబంధనల ప్రకారం కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు కీలక పాత్ర పోషిస్తుందని, యువత, ఉద్యోగులు, విద్యావంతులు రాజకీయాలపై అవగాహన పెంచుకుని తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుగ్గా పాల్గొని సమాజం, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇటీవల దేవాలయాలు, హిందూ ధర్మంపై జరుగుతున్న అకృత్యాలను ప్రస్తావించిన ఆయన.. దేశభక్తి, జాతీయత, హిందూ ధర్మ పరిరక్షణ కోసం కృషి చేసే భారతీయ జనతా పార్టీ అభ్యర్థికి పట్టభద్రులు తమ ఓటు ద్వారా మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజా సమస్యలపై తన పోరాటం కొనసాగుతూనే ఉంటుందని కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ అభివృద్ధి విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడబోమని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ హయత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీను, హైకోర్టు కాలనీ డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అపార్ట్‌మెంట్ వాసులు, పలువురు పట్టభద్రులు పాల్గొన్నారు.

## ఉల్లాసంగా జిల్లా సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్




**కొత్తగూడెం విశాల భారతి, అక్టోబర్ 4:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఉత్సాహభరితంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీలకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు ముఖ్య అతిథిగా హాజరై ఒలింపిక్ జెండాను ఊపి పరుగు పందెం పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలురతో పాటు బాలికలు కూడా అధిక సంఖ్యలో అథ్లెటిక్స్‌లో పాల్గొని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎండను సైతం లెక్కచేయకుండా క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. జిల్లా నుంచి ఇంత పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఐటీడీఏ స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు వరుసగా రాష్ట్ర స్థాయి ఛాంపియన్లుగా నిలుస్తుండటం గర్వకారణమన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని క్రీడాకారులకు సూచించారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే. మహీధర్ మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 11న ఆసిఫాబాద్‌లో జరగనున్న తెలంగాణ రాష్ట్ర సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు, నవంబర్‌లో హైదరాబాద్‌లో జరగనున్న జాతీయ అంతర్‌జిల్లా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపిక చేసి పంపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ క్రీడాకారుడు ఎండీ. బాబ్జీని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అబ్జర్వర్‌గా మందుల వెంకటేశ్వర్లు వ్యవహరించారు. అథ్లెటిక్స్ కోచ్ డి. మల్లికార్జున్‌రావు ఆధ్వర్యంలో కోచ్‌లు ఎం. నాగరాజు, పి. నాగేందర్, జె. గిరిప్రసాద్, ఎస్‌కే. రియాజ్ పాషా, కిన్నెరసాని ప్రసాద్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకట్ నారాయణ, ఈశ్వర్, జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంజులాల్ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- కారు ఢీకొని టిప్పర్ డ్రైవర్ మృతి.. కేసు నమోదు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా, అజాగ్రత్తగా నడిపిన కారు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న టిప్పర్ డ్రైవర్‌ను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన అతను చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకల్ మండలం రాచాల గ్రామానికి చెందిన గౌని జానకి రెడ్డి (42) టిప్పర్ వాహనాల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సుమారు నెల రోజుల క్రితం జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన, ప్రస్తుతం శంషాబాద్ మండలం నార్కుడలో నివాసముంటున్న అమిత్ కుమార్ రామ్ (34)ను తన టిప్పర్ వాహనం నంబర్ టీజీ 07 టీ 8782కు డ్రైవర్‌గా నియమించుకున్నాడు. ఈ క్రమంలో అక్టోబర్ 3వ తేదీ రాత్రి సుమారు 10 గంటల సమయంలో నార్కుడ సమీపంలో నిర్మాణ పనుల కోసం టిప్పర్ వాహనాలను డ్రైవర్లతో కలిసి పంపించారు. అందులో అమిత్ కుమార్ రామ్, కౌలేశ్వర్ బుయ్యా ఉన్నారు. అక్టోబర్ 4వ తేదీ అర్ధరాత్రి సుమారు 12.30 గంటల సమయంలో అమిత్ కుమార్ రామ్ బాత్రూమ్‌కు వెళ్తున్నానని కౌలేశ్వర్ బుయ్యాకు చెప్పి, నార్కుడ హనుమాన్ దేవాలయం ఎదురుగా ఉన్న ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న అమిత్ కుమార్ రామ్‌ను శంషాబాద్ నుంచి షాబాద్ వైపు వెళ్తున్న టీఎస్ 09 ఈజే 8128 నంబర్ గల మారుతీ స్విఫ్ట్ కారు ఢీకొట్టింది. కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా, నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదంలో అమిత్ కుమార్ రామ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న గౌని జానకి రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అనంతరం తీవ్రంగా గాయపడిన అమిత్ కుమార్ రామ్‌ను ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆయన మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై గౌని జానకి రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. వై. సురేందర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, శంషాబాద్ పోలీస్‌స్టేషన్, ఫ్యూచర్ సిటీ పర్యవేక్షణలో కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## దివ్యాంగులకు అన్నదానం.. మానవ సేవే మాధవ సేవ

- మందువ భరద్వాజ్ జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమం




**రాజేంద్రనగర్, విశాల భారతి :** మణికొండ మందువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మందువ భరద్వాజ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వనస్థలిపురంలోని శాంతినికేతన్ వికలాంగుల ఆశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని 60 మంది దివ్యాంగులకు అన్నప్రసాద వితరణ చేశారు. సనాతన ధర్మంలో అన్నదానానికి అత్యంత విశిష్టమైన స్థానం ఉందని, ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడం మానవ సేవలో గొప్ప భాగమని మందువ ఫౌండేషన్ ట్రస్టీ మందువ మధుసూదన్ శర్మ కుటుంబ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా తమ ఆహార అవసరాలను స్వయంగా సమకూర్చుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనే దివ్యాంగులకు అన్నప్రసాదం అందించడం ఎంతో సంతృప్తినిచ్చే సేవగా వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని దివ్యాంగులతో ఫౌండేషన్ సభ్యులు ఆత్మీయంగా మమేకమై, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. జన్మదిన వేడుకలను కేవలం వ్యక్తిగతంగా జరుపుకోవడం కంటే సమాజంలోని అవసరమైన వారికి అండగా నిలిచి, వారి ముఖాల్లో ఆనందాన్ని చూడటం మరింత సంతోషాన్నిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాల్లో జరిగే పుట్టినరోజులు, వివాహ వేడుకలు, వార్షికోత్సవాలు, ఇతర శుభకార్యాలను పురస్కరించుకుని ఆశ్రమాలను సందర్శించి దివ్యాంగులకు అన్నదానం చేయాలని వారు కోరారు. అలాగే వారికి అవసరమైన దుస్తులు, నిత్యావసర వస్తువులు, ఇతర సహాయాలను అందించడం ద్వారా తమ వంతు చేయూతనివ్వాలని సూచించారు. సమాజంలో ప్రతి ఒక్కరినీ సమానంగా ఆదరించి, ఆప్యాయతను పంచుకోవడం ద్వారా మానవతా విలువలను పెంపొందించవచ్చని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ దివ్యాంగులకు అండగా నిలవాలని మందువ ఫౌండేషన్ సభ్యులు ఆకాంక్షించారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వారు పిలుపునిచ్చారు.

## పాండవుల గుట్టకు పూర్వ వైభవం తీసుకురావాలి ఎమ్మెల్యే జారే




**విశాల భారతి,అశ్వారావుపేట :** అశ్వారావుపేట నియోజక వర్గం ములకలపల్లి మండలం నల్లముడి గ్రామంలోని పురాతన పాండవుల గుట్టను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ ఎమ్మెల్యే సోదరులు సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వచ్చిన ప్రత్యేక బృంద సభ్యులతో కలిసి పరిశీలించారు. పాండవుల గుట్ట ప్రాంతంలోని చారిత్రక ప్రదేశాలను బృందం పరిశీలించింది. ఈ ప్రాంతానికి ఉన్న చారిత్రక ప్రాధాన్యతను గుర్తించి పురాతన ఆలయాలు దేవాలయాలను పరిరక్షించడంతో పాటు వాటి విశిష్టతను ప్రజలకు తెలియజేసే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. పాండవుల గుట్టకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. ఈ ప్రాంతాన్ని చారిత్రక ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసే అవకాశాలపై కూడా పరిశీలన చేయనున్నట్లు తెలిపారు. పురాతన కట్టడాలు ఆలయాల పరిరక్షణకు ప్రభుత్వ సహకారం తీసుకుని భవిష్యత్ తరాలకు ఈ చారిత్రక సంపదను అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కడగండ్లు

- బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి
- ఎమ్మెల్యే అరాచకాలపై తిరగబడతామని హెచ్చరిక



**విశాల భారతి ఇబ్రహీంపట్నం ;** కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కడగండ్లు మాత్రమే మిగిలాయని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సత్తు వెంకటరమణారెడ్డి , మాజీ ఎంపిపి కృపేష్‌లు అన్నారు. ఇబ్రహీంపట్నం మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చిలుకల బుగ్గరాములు అధ్యక్షతన ఆదివారం బిఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన మండల ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కేవలం కేసీఆర్ ను కేటీఆర్ తిడుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. రైతులను , మహిళలను , ఉద్యోగులను , నిరుద్యోగులను , యువతను , విద్యార్థులను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ఏకమవుతున్నారని చెప్పారు. అనుకోకుండా దక్కిన అధికారాన్ని కేవలం సంపాదన కోసమే కాంగ్రెస్ పాలకులు వినియోగిస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కేవలం ఆడంబరాలకు , వసూళ్లకు , సంపాదనకు , బెదిరింపులకు , శిలాఫలకాలకు మాత్రమే పరిమితమయ్యాడని వారు మండిపడ్డారు. మండల సమావేశాల్లో సర్పంచులను ప్రజా సమస్యల గురించి మాట్లాడకుండా ఎమ్మెల్యే చిల్లరగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే తన పిచ్చి చేష్టలు మానకపోతే మంచాల మండల సమావేశంలో తిరగబడ్డట్టుగా తగు గుణపాఠం చెబుతారని అన్నారు. ఇబ్రహీంపట్నం , యాచారం , మంచాల గ్రామీణ మండలాలకు కనీసం ఒక్క హ్యామ్ రోడ్డును కూడా ఎమ్మెల్యే మంజూరు చేయించలేకపోయారని వారు మండిపడ్డారు. ఎమ్మెల్యే మల్ రెడ్డి కి అక్రమ సంపాదన మీద ఉన్న ఆసక్తి అభివృద్ధి మీద లేదని వారు దుయ్యబట్టారు. ఎమ్మెల్యే బెదిరింపులతో నియోజకవర్గంలో అభివృద్ధి అడుగంటిందని , రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని విమర్శించారు. ప్రభుత్వ అధికారులను బెదిరించి తప్పుడు పనులు చేయిస్తున్నారని , చివరకు పోలీసులను కూడా పని చేయకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దళితుల భూముల్లో ఎమ్మెల్యే మనుషులు అక్రమ మట్టి దందాలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అరాచకాలపై ప్రజల తిరుగుబాటు తప్పదని వారు హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియలో పార్టీ నాయకులు , కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ రెండు స్థానాలను బిఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకుంటుందని వారు ధీమా వ్యక్తంచేశారు. జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి , జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏనుగు నరేందర్ రెడ్డి , మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భాస్కర్ రెడ్డి , మంద సురేష్ , సర్పంచులు కాలె గణేష్ , బింగి గీత , బోసుపల్లి శ్రీవేణి , సామ అశ్విని , మంద యాదమ్మ , సొసైటీ మాజీ చైర్మన్ మహేందర్ రెడ్డి , వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి , విద్యార్థి విభాగం అధ్యక్షుడు జగదీష్ , మాజీ సర్పంచులు యాదగిరి , బల్వంత్ రెడ్డి , జెట్టి కృష్ణ , నాయకులు పొన్నాల జగదీష్ , జలంధర్ గౌడ్ , నర్సింహ్మా , రవీందర్ , అంజయ్య , అయిలయ్య , వీరయ్య , బాష , శ్రీకాంత్ రెడ్డి , రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## చింతలమెట్ హస్తాల ఈరన్న ఆలయంలో ఘనంగా శ్రమదానం

- రేపు ఉదయం ప్రత్యేక అభిషేకం, పూజలు



**రాజేంద్రనగర్, విశాల భారతి :** చింతలమెట్‌లోని శ్రీ హస్తాల ఈరన్న స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం భక్తులు, స్థానిక యువకులు, నాయకులు కలిసి శ్రమదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దారు. ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతో పాటు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో యువకులు, భక్తులు ఉత్సాహంగా శ్రమదానంలో పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి, పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. అనంతరం శ్రమదానంలో పాల్గొన్న భక్తులు, యువకులు ఆలయ ప్రాంగణంలోనే వంట వార్పు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు సోదరభావాన్ని చాటుతూ అందరూ కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**రేపు ప్రత్యేక పూజలు**

శ్రమదాన కార్యక్రమాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు శ్రీ హస్తాల ఈరన్న స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజల్లో భాగస్వాములు కావాలని కోరారు. ప్రత్యేక అభిషేకం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించనున్నట్లు తెలిపారు. ఆలయ సంప్రదాయాలను కొనసాగిస్తూ ప్రతి ఒక్కరూ ఐక్యంగా కార్యక్రమాలను నిర్వహించుకోవడం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు భవిష్యత్తులోనూ పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై. శ్రీధర్, బొక్కా బాల్ రెడ్డి, బాబురావు, వెంకటేష్, వెంకట్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, సందీప్, మహేష్, శీను, కృష్ణ గౌడ్, అమర్, వేణు, పవన్, నరేందర్, ఉపేందర్, మనోజ్, ప్రవీణ్, సాయి, శ్రీకాంత్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు, యువకులు పాల్గొన్నారు.

## ఉపసర్పంచుల హక్కులను కాలరాస్తే సహించేది లేదు



- అధికారాలు, విధులపై స్పష్టత ఇవ్వాలి.. గౌరవ వేతనం పెంచాలి. అభివృద్ధిలో సముచిత భాగస్వామ్యం కల్పించాలి
- సూర్కంటి శ్రీధర్ రెడ్డి ఉప సర్పంచ్ల ఫోరం యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు

**చౌటుప్పల్ విశాల భారతి:** యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉపసర్పంచుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని జిల్లా ఉపసర్పంచుల ఫోరం నిర్ణయించింది. భువనగిరి పట్టణంలో మందలోగూడెం గ్రామ ఉపసర్పంచ్, జిల్లా ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచుల అధికారాలు, విధులపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, గౌరవ వేతనం పెంచాలని, గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో ఉపసర్పంచులకు సముచిత భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సమావేశాల్లో ఉపసర్పంచులకు తగిన ప్రాధాన్యత కల్పించడంతో పాటు, వారి సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కోరారు. ఉపసర్పంచుల గౌరవానికి భంగం కలిగిస్తే సహించేది లేదని సమావేశం ద్వారా హెచ్చరించారు. జిల్లాలో ఏ గ్రామంలోనైనా ఉపసర్పంచులపై సర్పంచులు దాడులకు పాల్పడినా, వారి గౌరవాన్ని కించపరిచినా తీవ్రంగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ఉపసర్పంచుల హక్కులు, గౌరవం కోసం జిల్లాలోని ఉపసర్పంచులంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు గ్రామాల ఉపసర్పంచులను జిల్లా కమిటీలోకి తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారు జిల్లా కమిటీకి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఉపసర్పంచుల హక్కుల సాధన కోసం జరిగే పోరాటాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ కార్యవర్గ సభ్యులు చిన్నం బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు చిలకల సంతోష్, వెల్దండ కృష్ణారెడ్డి, వడ్డబోయిన వెంకటేష్, లింగారెడ్డి, ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు బొమ్మకంటి కిషోర్, వెంకటేష్‌నాయక్, పార్వతీపురం ఉపసర్పంచ్ నరేందర్, వర్క్‌పల్లి ఉపసర్పంచ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు నిర్మల్ జిల్లాలో మంత్రుల పర్యటన

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలుకలెక్టరేట్‌లో సమీక్ష
- ప్రజావాణి యథావిధిగా కొనసాగుతుంది
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**విశాల భారతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లాలో సోమవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 10 గంటలకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన అధికారులు హాజరుకానున్నట్లు వివరించారు. మంత్రుల పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మంత్రుల పర్యటన ఉన్నప్పటికీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని ప్రత్యేక విభాగంలో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

## శిల్పి కాలనీ సంక్షేమానికి సమష్టి సారథ్యం

- అధ్యక్షుడిగా ఆల్వాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురేష్‌రెడ్డి ఏకగ్రీవ ఎన్నిక..
- కాలనీ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని హామీ



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** శిల్పి కాలనీ అభివృద్ధి, సంక్షేమం కోసం కాలనీ వాసులు సమష్టిగా ముందుకు సాగేందుకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్ద అంబర్‌పేట పరిధిలోని శిల్పి కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. కాలనీ సభ్యులంతా ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకోవడం విశేషంగా నిలిచింది. నూతన కార్యవర్గం మూడేళ్ల పాటు కొనసాగనుంది. సంఘం అధ్యక్షుడిగా బొమ్మిడిక ఆల్వాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దుబ్బాక సురేష్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా చౌదర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బండ శేఖర్‌రెడ్డి, మేక మల్లారెడ్డి, చీఫ్ అడ్వైజర్లుగా పశ్య వీరారెడ్డి, గుదిబండ గోవిందరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శులుగా తాటికొండ లింగారెడ్డి, జి.మల్లేష్‌యాదవ్, సంయుక్త కార్యదర్శులుగా గోకుల వెంకటరెడ్డి, దేవరపల్లి నరసింహారెడ్డి, పాల్వాయి శేఖర్‌రెడ్డి, ఖజానాదారులుగా బి.నాగేశ్వరరావు, ఇరిగల నరసింహరెడ్డి ఎన్నికయ్యారు. ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పోరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాంపల్లి రామకృష్ణారెడ్డి, కారే శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులుగా బత్తిని నరసింహ, దోర్నాల ధనంజయ్, కే.కలెందర్‌రెడ్డి, రామస్వామి శ్రీకాంత్‌రెడ్డి, కే.చెన్నారెడ్డి, బండ శశిధర్‌రెడ్డి, కందికంటి రమేష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, లింగమనేని పూర్ణచందర్, జి.సురేష్, సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు.

**సంక్షేమమే ప్రధాన లక్ష్యం**

నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. పదవులు బాధ్యతగా భావించి కాలనీ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేస్తామని తెలిపారు. కాలనీలో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సభ్యుల సహకారంతో పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కాలనీలో మౌలిక వసతుల మెరుగుదల, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలపై దృష్టి సారిస్తూ శిల్పి కాలనీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. కాలనీ సభ్యుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ప్రతి కుటుంబానికి సంక్షేమ సంఘం అండగా నిలిచేలా పనిచేస్తామని స్పష్టం చేశారు. తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న కాలనీ వాసులందరికీ నూతన కార్యవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## మహా పాదయాత్రకు మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే సంఘీభావం






**విశాల భారతి, జుక్కల్;** కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం దోసపల్లి సంస్థాన్ శ్రీ జగద్గురు రామానందాచార్య జీ మఠం ఆధ్వర్యంలో తెలంగాణ నుంచి మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా న్యానిజ్ ధామ్ వరకు మహా పాదయాత్ర నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, భూమి, చెట్లు, నీటిని కాపాడుకోవడంతో పాటు ప్రకృతిని రక్షించాలనే సందేశంతో చేపట్టిన ఈ మహా పాదయాత్ర ఎంతో గొప్పదని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహారాష్ట్రలోని ఏలి గ్రామంలో కొనసాగుతున్న మహా పాదయాత్రలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు. పాదయాత్రలో భక్తులతో కలిసి ఆయన అడుగులు వేశారు. అనంతరం శ్రీ జగద్గురు రామానందాచార్య జీని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రకృతి పరిరక్షణ కోసం చేపట్టిన ఈ మహా పాదయాత్రకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హన్మంత్ షిండే తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ చెట్లను పెంచడంతో పాటు నీరు, భూమి, ప్రకృతి వనరులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. భక్తులు, మఠం నిర్వాహకులు, పాదయాత్రికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటూ ప్రకృతి పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు.

**ప్రకృతిని కాపాడుదాం...**

భవిష్యత్ తరాలను రక్షిద్దాం...
అనే సందేశంతో ఈ మహా పాదయాత్ర
కొనసాగుతోంది.

## మాజీ ఎమ్మెల్యేకు బాసర నవరాత్రి ఉత్సవాల ఆహ్వానం



**విశాల భారతి, బాసర :** పవిత్ర పుణ్యక్షేత్రం చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ఈనెల 11 నుండి 20వ తేదీ వరకు నిర్వహించే దేవి శరన్నవరాత్రి ఉత్సవాల భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా ఆలయ క్షేత్రంలోని బాలలయంలో నిర్వహించి నవరాత్రి ఉత్సవాలకు ముదురు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోస్లే నారాయణరావు పటేల్ కు ఆలయ అధికారులు కండువా కప్పి అనంతరం దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన మాజీ ఎమ్మెల్యే బాసర ఆలయంలో ప్రతి సంవత్సరం మాదిరిగా నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ సంవత్సరం కూడా ఉత్సాహంగా నిర్వహించాలని ఇప్పటికే ఆలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ గంగ శ్రీనివాస్ తో పాటు పిఆర్ఓ నారాయణ పటేల్ ఆలయ సిబ్బంది నాయకులు తదితరులు ఉన్నారు.

# నెట్టింటిని షేక్ చేస్తోన్న భాగ్య శ్రీ బోర్సే

మిస్టర్ బచ్చన్ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది భాగ్య శ్రీ బోర్సే.. ఆ తర్వాత కింగ్ డమ్, ఆంధ్రా కింగ్ తాలూకా సినిమాల్లో నటించగా.. ఈ మూవీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయాయి. చివరగా అఖిల్ అక్కినేనితో కలిసి నటించిన లెనిన్ ఈ బ్యూటీకి మంచి విజయాన్ని అందించింది. సంప్రదాయ దుస్తుల్లో, ట్రెండీ కాస్ట్యూమ్స్‌లో అయినా కెమెరాకు ఫోజులిచ్చిందంటే ఈ భామ లుక్స్ కు ఫిదా అవ్వాల్సిందే. భాగ్య శ్రీ బోర్సే తాజా స్టైలిష్ క్యాజువల్ లుక్‌కు సంబంధించిన ఫొటోలను నెట్టింట పోస్ట్ చేసింది. బ్లూ డెనిమ్, మినీ స్కర్ట్‌లో ట్రెండీ టచ్ ఇస్తూ కెమెరాకు ఫోజులిచ్చింది. హెరిటేజ్ బిల్డింగ్, తాటి చెట్ల ముందు కూర్చొని దిగిన స్టిల్స్ కుర్రకారుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.